సాక్షి
నిజామాబాద్
బుధవారం, 18, సెప్టెంబర్, 2024


నగరంలోని వినాయకుల బావిలో గణపతుల నిమజ్జనం

న్యూస్‌రీల్

గణేశ్ లడ్డూ అక్షరాల లక్షా నలభై వేలు



బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీచక్రేశ్వర శివాలయంలో నిర్వహించిన సార్వజనిక్ గణేశ్ లడ్డూకు వేలం పాటలో రికార్డు ధర పలికింది. మండలంలోని ఏరాజ్‌పల్లికి చెందిన చిన్నోళ్ల సాయిరెడ్డి లడ్డూను రూ.లక్షా 40వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఎమ్మెల్యే, మాజీమంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాయిరెడ్డికి లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శి మహేశ్, కోశాధికారి దేవీదాస్, అర్చకులు గణేశ్ మహరాజ్, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.


'గుత్ప' నీటి విడుదల



నందిపేట్(ఆర్మూర్): అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల నీటిని మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి.. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న మొదటి పంపుహౌస్ వద్ద వారు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుత్ప లిఫ్ట్ ద్వారా ఆర్మూర్, నందిపేట, మాక్లూర్, ఆలూర్, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాల రైతులకు చెందిన సుమారు 34,650 ఎకరాలకు నీటిని అందిస్తామన్నారు. చివరి ఆయకట్టుకు నీరందే వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 545 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, అవసరం మేరకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాయారెడ్డి, మాజీ ఎంపీటీసీ ధాత్రిక రాజు, కుమ్మరి చిన్నయ్య, పెయింటర్ రాజు, సాయికిరణ్, లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, పిప్పెర సాయారెడ్డి, పెంట ఇంద్రుడు, లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ మీదుగా కొనసాగుతున్న శోభాయాత్రలో పాల్గొన్న నగరవాసులు

గణనాథునికి ఘనమైన వీడ్కోలు





- వైభవంగా నిమజ్జన శోభాయాత్ర
- అడుగడుగునా భక్తజన సందోహం
- గణేశ్ మండపాల్లో పోటాపోటీగా లడ్డూ వేలంపాటలు
- ఉమ్మెడ గోదావరికి తరలిన భారీ విగ్రహాలు



నిజామాబాద్ రూరల్: పదకొండు రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, భజనలు, సంకీర్తనలతో భారీ జనసందోహం మధ్య గణేశ్ శోభాయాత్ర కొనసాగగా, ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జిల్లా కేంద్రంలోని దుబ్బలో సార్వజని గణేశ్ మండలి ఆధ్వర్యంలో శోభాయాత్రను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షుడు బంటు గణేశ్ జెండా ఊపి ప్రారంభించారు. 14 జతల ఎద్దులు గణనాథుని రథాన్ని ముందుకు తీసుకెళ్లాయి. రథాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దుబ్బాలో ప్రారంభమైన శోభాయాత్ర గంజ్, గాంధీ గంజ్, నెహ్రూ పార్క్, గురుద్వార్, గోల్‌హనుమాన్ మీదుగా వినాయక్ నగర్‌లోని వినాయకుల బావి వద్దకు చేరుకుంది. ఎనిమిది ఫీట్ల వరకు ఎత్తును గణనాథులను అర్సపల్లి, జానకంపేట మీదుగా బాసర గోదావరికి తరలించగా, ఎనిమిది ఫీట్లకన్నా ఎక్కువ ఎత్తున విగ్రహాలను కంఠేశ్వర్, మానిక్ బండార్, దాస్‌నగర్, నందిపేట్ మీదుగా ఉమ్మెడ గోదావరి తీరానికి తరలించారు. గణేశ్ మండలిల వద్ద లడ్డూ వేలంపాటలు పోటాపోటీగా సాగాయి.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు

శోభాయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా నిజామాబాద్ అర్బన్, బోధన్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, సుదర్శన్‌రెడ్డితోపాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ తదితరులు దుబ్బలో సార్వజనిక్ గణేశ్‌మండలి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండలి ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు ఎమ్మెల్యేలతోపాటు కలెక్టర్, సీపీకి స్వాగతం పలికారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పూజలో పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఉన్న బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రతి పండుగను కులమతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు బాసర, ఉమ్మెడ వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జన శోభాయాత్రను కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. సుమారు రెండు వేల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

యంచ వద్ద గోదావరిలో భారీ వినాయక విగ్రహ నిమజ్జనం


దుబ్బలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, బంటు గణేశ్


శోభాయాత్రలో పాల్గొన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నాయకులు


కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్న కలెక్టర్, పోలీస్ కమిషనర్

చారిత్రాత్మక దినం సెప్టెంబర్ 17

- మరో ప్రతిపక్షం ఈ రోజును వివాదం చేయాలని చూస్తోంది
- ఒక కుటుంబం దయాదాక్షిణ్యాలపై రాష్ట్రం బతకాల్సి వచ్చింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది
- ప్రజాపాలన దినోత్సవంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

నిజామాబాద్‌అర్బన్: తన దృష్టిలో జూన్ 2 కన్నా తెలంగాణకు సెప్టెంబర్ 17 చారిత్రాత్మక దినమని, జూన్ 2 ప్రాధాన్యతను తగ్గించడం నా ఉద్దేశం కాదని రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. నాటి సాయుధ పోరాటంలో నిజామాబాద్ జిల్లా తనవంతు పాత్ర పోషించిందని, జిల్లాకు చెందిన అనేకమంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. సెప్టెంబర్ 17ను వివాదం చేయాలని మరో ప్రతిపక్షపార్టీ ప్రయత్నిస్తోందన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్.. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. గతేడాది సెప్టెంబర్ 17 నాడు హైదరాబాద్‌లో సోనియాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ విజయసంకల్ప భేరీ మోగించిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలతోపాటు గత పాలనలో లోపించిన ప్రజాస్వామ్యాన్ని ఏడో గ్యారెంటీగా ఇస్తామని మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం తమ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇనుప కంచెలను తొలగించి స్వేచ్ఛకు ప్రాణం పోసిందని, సామాన్యుల కోసం సచివాలయ గేట్లు తెరిచి ఉంచామన్నారు. గత పదేళ్లలో ఎమ్మెల్యేలు, మంత్రులకు ఆత్మగౌరవంతో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. నాటి ప్రగతి భవన్ గేట్ల వద్ద ప్రజాప్రతినిధులకు జరిగిన అవమానాలను మర్చిపోదామా? అని ప్రశ్నించారు. ఒక కుటుంబ దయాదాక్షిణ్యాలపై తెలంగాణ బతకాల్సిన పరిస్థితికి కారణం నాటి పాలకులు కాదా అని అన్నారు.


ప్రసంగిస్తున్న ఈరవత్రి అనిల్

ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు..

ఈ ఎమినిది నెలల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అనిల్ తెలిపారు. ఆడ బిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటి వరకు జిల్లాలో 4.58కోట్ల మంది లబ్ధి పొందారన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంపు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలను ప్రస్తావించారు. రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేసి రుణం నుంచి విముక్తులను చేశామన్నారు. గత పదేళ్లలో పంట నష్టపరిహారం అందించలేని, ప్రస్తుత ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తుంటే ప్రతిపక్షం జీర్ణించుకోలేకపోతున్నదన్నారు. అలాగే ప్రభుత్వం గల్ఫ్ వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటుపై నిర్ణయం తీసుకుందన్నారు. హైడ్రాతో గత పాలకుల గుండెల్లో దడ మొదలైందని, ప్రక్షాళన ప్రారంభం కాగానే కొందరు విలవిలలాడుతున్నారన్నారు. భవిష్యత్‌లో జిల్లా కేంద్రాలకు హైడ్రాతరహా కార్యక్రమాన్ని విస్తరించాలన్న ఆకాంక్ష ప్రజల నుంచి వ్యక్తమవుతోందన్నారు.

నగర మేయర్ నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర సహకార ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు సీపీ కోటేశ్వర రావు, జెడ్పీ సీఈవో ఉషా, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


జెండాకు వందనం చేస్తున్న ఈరవత్రి అనిల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ తదితరులు


పాల్గొన్న జిల్లా అధికారులు

క్లుప్తంగా

సత్య గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే



డొంకేశ్వర్: మండల కేంద్రంలోని సత్య(కర్ర) గణపతిని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అందరితో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే వెంట సురేందర్, చిన్నా, కల్లెం సంతోష్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, సర్వసమాజ్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

జెన్‌కో అధికారుల సేవలు అభినందనీయం



బాల్కొండ: ఎస్సారెస్పీ జల విద్యుదుత్పత్తి కేంద్రంలో పని చేసే జెన్‌కో అధికారుల సేవలు అభినందనీయమని రాష్ట్ర బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ శాఖ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం ఆయన ఎస్సారెస్పీ, జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2010లో తాను విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నాలుగవ టర్బయిన్‌ను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అనంతరం ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. అనంతరం అధికారులు షబ్బీర్ అలీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెన్‌కో సీఈ రమేశ్, ఎస్ఈ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): తెయూ కామర్స్ విభాగం, టాలీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను కామర్స్ బోధించే అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో 'క్లిక్-లెర్న్ టీచ్-ప్రైమ్' వర్క్‌షాప్ బ్రోచర్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌లో డిగ్రీ, పీజీ స్థాయిలో బోధించే కామర్స్ అధ్యాపకులకు మారిన సిలబస్‌లో నూతన ప్రక్రియలను సాంకేతికంగా, సులభ పద్ధతిలో బోధించే పద్ధతులను తెలియజేస్తారన్నారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలలో పని చేసే కామర్స్ అధ్యాపకులందరూ సెప్టెంబర్ 23 లోపు రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వర్క్‌షాప్ డైరెక్టర్ రాంబాబు గోపిశెట్టి కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, అధ్యాపకులు జి శ్రీనివాస్, శ్వేత, కె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ శోభాయాత్రలో ఘర్షణ



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని గణేశ్ శోభాయాత్రలో ఘర్షణ చోటు చేసుకుంది. మంగళవారం నిర్వహించిన శోభాయాత్రలో రెండు గణేశ్ మండపాల నిర్వాహకులు రోడ్డుపై ముందుకు వెళ్లే విషయంలో వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించినా వినకపోవడంతో సీఐ పిట్లం, బిచ్కుంద ఎస్సైలతో ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. పలువురిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.



గంజ్ ప్రాంతంలో ముందుకు సాగుతున్న రథం



వినాయకబావిలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

బైబై గణేశా..



ఆర్మూర్: డొంకేశ్వర్‌లో కర్ర గణపతి శోభాయాత్ర

సాక్షి, నెట్‌వర్క్: నవరాత్రులు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మంగళవారం డప్పులు, కోలాటాలు, నృత్యాల మధ్య శోభాయాత్రగా గణనాథుని విగ్రహాలను తీసుకెళ్లి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు శోభాయాత్రను ప్రారంభించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన రథయాత్ర అలరించింది. దుబ్బ నుంచి వినాయకుల బావి వరకు కొనసాగిన రథానికి భక్తులు ఘనస్వాగతం పలికారు.



జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ కల్మేశ్వర్



బోధన్: గణేశ్ శోభాయాత్రలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నందిపేట: ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: తెప్పపై గణేశ్ విగ్రహాన్ని తీసుకెళ్తున్న ఈతగాళ్లు



ఆర్మూర్‌లో క్రేన్ సాయంతో..



యంచ బ్రిడ్జిపై గణనాథులతో భక్తులు



జక్రాన్‌పల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



గోల్‌హనుమాన్ ప్రాంతంలో కొనసాగుతున్న శోభాయాత్ర

గల్ఫ్ కార్మికుల ఆశలపై నీళ్లు..



మాట్లాడుతున్న కోటపాటి నర్సింహ నాయుడు

ఆర్మూర్: గల్ఫ్ కార్మికుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందని ప్రవాస భారతీయుల హక్కుల, సంక్షేమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహ నాయుడు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీ లోపు సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. కంటి తుడుపు చర్యగా జీవో నంబర్ 205ను విడుదల చేసి గంపెడు ఆశతో ఉన్న గల్ఫ్ కార్మికులను నిరాశపర్చిందన్నారు. కేవలం 7 దేశాలలో మాత్రమే ఎవరైనా చనిపోతే వారికి మాత్రమే రూ.ఐదు లక్షల పరిహారం చెల్లింపు వర్తిస్తుందని పేర్కొనడం ఉపాధి కోసం ఇతర దేశాలకు వలస పోయిన పేద కార్మికుల ఆశలపై నీళ్లు చల్లడమే అని వివరించారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం భారతదేశం నుంచి వలస వెళ్లి చదువు రాని లేదా పదో తరగతి కంటే తక్కువ చదువుకొన్న వారు ఉపాధి కోసం వెళ్లే ముందు తప్పనిసరిగా ఇమిగ్రేషన్ (ఈసీఆర్) చేసుకోవాలని అనుమతిస్తూ చట్టం చేసిందన్నారు. అలా(18) దేశాలను గుర్తించిందని వివరంచారు. అవి బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఓమన్, ఖత్తర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో పాటు లిబియా, యోమెన్, సుడాన్, సిరియా, లేబనాన్, ఆఫ్ఘనిస్తాన్, మలేషి యా, థాయిలాండ్, ఇండోనేషియా, దక్షిణ సుడాన్, జోర్డాన్ ఉన్నాయన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మొదటి ఏడు దేశాలను మాత్రమే గుర్తించి అక్కడ చనిపోతే మృతధన సహాయంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని చెప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవోను సవరించి అన్ని దేశాలకు వలస వెళ్లిన పేద కార్మికులకు వర్తించే విధంగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన జూన్ 2014 నుంచి గల్ఫ్‌లో చనిపోయిన రెండు వేల మంది కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో నల్ల నాగు కలకలం



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నల్ల నాగుపాము కలకలం సృష్టించింది. పాము పాఠశాల ఆవరణలోకి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు స్పందించి వెంటనే పామును చంపేయడంతో వి ద్యార్థులు ఊపిరి పీల్చుకున్నా రు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, పిచ్చి మొక్క లు పెరగడంతో పాఠశాల ఆవరణలోకి విషపురు గులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని దేశాభివృద్ధికి దోహదపడాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వపరంగా విరాట్ విశ్వకర్మ జయంతి నిర్వహించారు. కార్మికుల వృత్తి నైపుణ్యం పెంపొందించడంతోపాటు, వారికి ఉపాధి కల్పించి ఆర్థిక చేయూత అందిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఆయా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక డంప్‌లు సీజ్

రుద్రూర్: పొతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలో అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్టు తహసీల్దార్ మల్లయ్య మంగళవారం తెలిపారు. గ్రామంలో మెయిన్ రోడ్డు వద్ద 10, కల్లు బట్టి వద్ద 20 ట్రాక్టర్ల ట్రిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఇసుకను ఈ నెల 19న తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.ఐదు వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందని వివరించారు.

ఇందూరు తిరుపతి.. జెండా బాలాజీ



జెండా బాలాజీ మందిరం

- నేటితో ముగియనున్న ఉత్సవాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు

నిజామాబాద్‌రూరల్/ నిజామాబాద్‌నాగారం: కలియుగదైవం.. వేంకటేశ్వర స్వామి కొలువైన ఇందూరు తిరుపతిగా పేరుగాంచింది జెండా బాలాజీ మందిరం. రెండు వందల ఏళ్లుగా భక్తులకు ఆధ్యాత్మికతను పంచుతోంది. ఏటా భాద్రపద మాసంలో పక్షం రోజుల పాటు జెండా బాలాజీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ చరిత్ర, విశిష్టతపై ప్రత్యేక కథనం..

ఆలయ చరిత్ర..

తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలు నిజాం పాలనలో ఉన్న సమయంలో నాందేడ్ జిల్లా కందార్‌కు చెందిన తుకోజి స్వామి వారి భక్తుడు. ఏటా తిరుమలకు కాలనడకన వెళ్లి వచ్చే వారు. ఇలా 41 సార్లు వెళ్లారు. తీరా వృద్ధాప్యం వచ్చాక తిరుమల చేరుకున్నాక కొండలు ఎక్కలేనని తనకు దర్శనభాగ్యం కల్పించాలని స్వామిని వేడుకున్నారు. స్వామి వారు క్షేత్రాధికారికి కలలో కనిపించి తన ఉత్సవ విగ్రహాలను తుకోజికి ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఉత్సవమూర్తులతో ఇంటికి వెళ్తుండగా నిజామాబాద్‌లో రాత్రి బసచేశారు. ఆయన నిద్రించిన ప్రదేశంలోనే తన గుడి నిర్మించాలని స్వామివారు సిర్నపల్లి దేశ్‌ముఖ్‌ను ఆదేశించగా 1858లో ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి దీనిని జెండా బాలాజీ మందిరంగా పేరు పొందింది. దాత నర్సాగౌడ్ నేతృత్వంలో 1930లో ఆలయాన్ని మరింత అభివృద్ధిపర్చారని చరిత్రకారులు చెబుతున్నారు.

విజయవంతం చేయాలి

జిల్లా కేంద్రంలో నిర్వహించే జెండా జాతరకు ప్రత్యేక చరిత్ర ఉంది. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాలు ముగింపు సందర్భంగా జెండా ఊరేగింపు ఉంటుంది. స్వామివారి జెండా ముందుండగా ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా పులాంగ్ బ్రిడ్జి వరకు తరలివెళ్లి వెళ్ళి విశ్రాంతి విడిది చేయడంతో ఉత్సవ కార్యక్రమాలు ముగుస్తాయి. జెండా జాతరను భక్తులు విజయవంతం చేయాలి.

– విజయ రామారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్

జెండా మోసేది ఆర్మూర్ బక్కన్న కుటుంబీకులే..



ఆర్మూర్ వంశస్తులు జెండాను మోస్తున్న దృశ్యం(ఫైల్)

బాలాజీ జెండాను మోసే బాధ్యత, ఉత్సవాల నిర్వహణ తమకు తరతరాలు వస్తున్న వార సత్వ సంపద అని ఆర్మూర్ బక్కన్న కుటుంబీకు లు ఆర్మూర్ సుదర్శన్, ఆర్మూర్ రత్నాకర్, రమేశ్, సురేశ్, శ్రీనివాస్, కరుణాకర్ తెలిపారు. మా పూర్వీకులు ఆర్మూర్ బక్క న్న, అతని అన్నదమ్ముళ్లు జెండా బాలాజీ ఉత్సవాలను ప్రతి ఏడాది 11 రోజుల పాటు నిర్వహించే వారని తెలిపారు. స్వామి వారి జెండా మోసే బాధ్యత, ఉత్సవాల నిర్వహణ మా పూర్వీకుల నుంచి మా తాతలకు, మా తాతల నుంచి మా తండ్రులకు, మా తండ్రుల నుంచి మా పిల్లలకు జాతరాల నిర్వహణ మా ఆధ్వర్యంలోనే కొనసాగడం మా అదృష్టం భావిస్తున్నా మని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో భక్తులు కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకం ఎంతో ఉంది. అందుకనే ఆలయానికి తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు విశిష్టమైన గుర్తింపు

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి



జెండా వందనం చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సెప్టెంబర్ 17వ తేదీకి విశిష్టమైన గుర్తింపు ఉందని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రిజిస్ట్రార్ వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. 1947ఆగస్టు15న భారత దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో నిజాం నిరంకుశ పాలనకు సమాధి చేసి బానిస సంకెళ్ల నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి చేసిన రోజుగా 1948 సెప్టెంబర్ 17 చరిత్ర కెక్కిందన్నారు. ఈ క్రమంలో అనేకమంది అమరులయ్యారని, అమరుల త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ ఎం సత్యనారాయణరెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్ వీరంగం

- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన ట్రాలీ ఆటో అద్దాల ధ్వంసం
- చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న కమిషనర్



కౌన్సిలర్ దాడిలో ధ్వంసమైన ఆటో అద్దం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఓ కౌన్సిలర్ వీరంగం సృష్టించాడు. ట్రాలీ ఆటో అద్దాలను ధ్వంసం చేశాడు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొత్త ట్రాలీలను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా అక్కడికి వచ్చిన 36వార్డు కౌన్సిలర్ చైర్‌పర్సన్‌తో, కమిషనర్‌తో వాగ్వాదం చేశాడు. తన వార్డుకు చెత్తను తరలించడానికి ఆటోను ఎందుకు పంపడం లేదని వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కోపంతో నూతన ట్రాలీ ఆటో అద్దాలను ధ్వంసం చేయడంతో పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది భయందోళనకు గురయ్యారు. గతేడాది నుంచి 36వ వార్డులో చెత్తసేకరించే వాహనం రావడం లేదని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినాన పట్టించుకోవడం లేదన్నారు. ఆటో అద్దాల ధ్వంసంతో ఆటో ట్రాలీల ప్రారంభోత్సవం ఆగిపోయింది. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన కౌన్సిలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజు అన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో భార్య హత్య

వర్ని: కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన ఘటన వర్ని మండలంలోని వడ్డేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య, పెంటవ్వ(46) భార్యాభర్తలు. కొన్ని రోజులుగా ఇంట్లో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి సైతం వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో మద్యం మత్తులో ఉన్న బాలయ్య ఇంట్లో ఉన్న కొడవలితో పెంటవ్వపై ఇష్టానుసారంగా మెడ, చాతిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సకాలంలో వైద్యం అందక దూడ మృతి



భిక్కనూరు: అస్వస్థతకు గురైన ఆవు దూడకు సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బండమీది బాల్‌రాజు ఆవు దూడ మంగళవారం అస్వస్థతకు గురికావడంతో గ్రామంలో ఉన్న పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో పశువైద్య సిబ్బందికి ఫోన్ చేయగా వారు స్పందించలేదు. కొద్ది సేపటికి దూడ మృతి చెందింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన ఆవు దూడ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరాడు.

చోరీకి పాల్పడిన నిందితుడి పట్టివేత

- చెట్టుకు కట్టేసి చితకబాదిన స్థానికులు

భిక్కనూరు: చోరీకి పాల్పడిన ఓ నిందితుడిని స్థానికులు పట్టుకొని, చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తక్కనోళ్ల కోరె బీరయ్య మంగళవారం ఉదయం గంజ్ ప్రాంతంలో నిలిపి ఉన్న వ్యాన్ అద్దాలను పగులగొట్టి అందులో ఉన్న టేప్ రికార్డ్‌ను చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకొని చెట్టుకు కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బీరయ్య పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

లింగంపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న కిరాణ దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఆకుల సాయిలు కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం దుకాణం తీసిందుకు రాగా తలుపులు విరిగి ఉన్నట్లు గుర్తించాడు. ఈ చోరీలో రూ. పదివేలు విలువ చేసే సిగరేట్లు, చిల్లర నగదును దుండగులు చోరీ చేశారన్నారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ల సీజ్



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లతో అధికారులు

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా భూమిని చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో రవీందర్ మంగళవారం పేర్కొన్నారు. పట్టుకున్న వాటిలో రెండు ట్రాక్టర్లు కోనసముందర్‌కు చెందిన మక్కల చిన్నయ్యవి కాగా, మరో ట్రాక్టర్ కుప్కాల్‌కు చెందిన భూక్య గణేశ్‌గా విచారణలో గుర్తించామన్నారు. అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇప్పించిన అప్పు ఇవ్వడం లేదని ఆత్మహత్య



నరేష్(ఫైల్)

కామారెడ్డి రూరల్: అవసరం నిమిత్తం బయట అప్పు ఇప్పిస్తే తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకుండా ఏం చేసుకుంటారో చేసుకొమ్మని బెదిరింపులకు పాల్పడటంతో అప్పు ఇప్పించిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాంధారి నరేశ్(40) కామారెడ్డికి చెందిన ఓ వ్యక్తికి తన సొంత డబ్బు ఇవ్వడంతో పాటు ఇతరుల వద్ద మొత్తం రూ.10 లక్షల అప్పు ఇప్పించాడు. కొద్దిరోజులుగా డబ్బుల గురించి అడిగితే రేపు మాపు అంటూ వాయిదాలు పెడుతూ వస్తున్నాడు. రెండురోజుల క్రితం డబ్బులు ఖచ్చితంగా కావాలని గట్టిగా అడిగితే డబ్బులు లేవని, ఏం చేసుకుంటావో చేసుకొమ్మని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తన సొంత డబ్బుతో పాటు ఇప్పించిన డబ్బులు వస్తాయో రావో అని మనస్తాపం చెంది ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.